

# పతంజలి

## సాహిత్యం

రెండవ సంపుటం

కథలు । పతంజలిభాష్యం । సంపాదకీయాలు
అవీ ఇవీ । గెలుపుసరే బతకడం ఎలా?

# పతంజలి సాహిత్యం

(లభ్య రచనల సంకలనం)

## రెండవ సంపుటం

కథలు

పతంజలి భాష్యం

సంపాదకీయాలు

అవీ - ఇవీ

గెలుపుసరే బతకడం ఎలా?

మనసు ఫౌండేషన్

40, జెసి ఇండస్ట్రియల్ ఏరియా, కనకపుర రోడ్,

**బెంగుళూరు 560 062**

# విషయసూచిక


పాత సీసాలో కొత్త సారా లేక... కొస్సీసాలో పాస్సారా .......... 5

గాండేరం .......... 11

మోటు మనిషి .......... 19

పది పైసలు .......... 23

దిక్కుమాలిన కాలేజీ .......... 26

"సిగ్గులేదు..." .......... 30

మరణ మృదంగం .......... 36

స్తంభాలు .......... 42

వెళ్ళొస్తాను భానూ! .......... 45

అడల్ట్‌స్టోరీ .......... 51

చూపున్న పాట .......... 54

పోయేకాలం .......... 59

సీతప్పరాజుగారి కుక్క .......... 68

జాలికథ .......... 71



# పాత సీసాలో కొత్త సారా లేక... కొస్సీసాలో పాస్సారా

'రూమ్మేటూ! రూమ్మేటూ ఇవాళ ఎండొొచ్చింది సుమా!' కాలేజీ నుంచి వస్తూనే గాబరాగా అన్నాడు పురుషోత్తం అర్థం కాలేదు నాకు.

'అదేవిటి సాయేబూ! ఎండ ప్రతిరోజూ వస్తుందిగా'

'మరీ నిఝువే! ఒక్క ఆదివారం తప్ప... ఒక్క రోజూ రావడం మానదు'

'ఆదివారం నాడు ఎండ రావటం లేదంటావేమిటిరా నీ మొహం మబ్బు పట్టేసినప్పుడు తప్ప ఎప్పుడూ, సూర్యుడున్న ప్పుడల్లా ఎండొస్తూనే వుంటుంది'

నా అజ్ఞానానికి కాబోలు వాడు జాలిగా నవ్వేడు.

'ఎండంటే తెలీదేమిట్నీకు... పోనీ గొడుగు తెలుసా?' అయోమయంగా వుంది నాకూ, చదివే మీకూ.

'ఎర్రగా, నాజుగ్గా, అందంగా వుంటుందే, ఆ అమ్మడి పేరన్న మాట ఎండ... మరి పంతులోరేయ్! ఆవిడ ప్రక్కనే కొంచెం నల్లగా, బీరు బోటిలు కార్కంత బొట్టూ, చిన్న చిన్న మీసాలూ వుంటాయే... ఆ అమ్మాయి పేరన్నమాట గొడుగు'

ఉత్తరధృవాన్ని మొట్టమొదటిసారిగా చూసొచ్చినాయన పేరు నాకు తెలీదు గాని, ఆయన ఆ ప్రాంతాన్ని జనానికి వర్ణిస్తూ చెప్పినప్పుడు ఆయన మా పురుషోత్తంగాడిలాగే ఆనందించి వుండొొచ్చు... నాకు మాత్రం నవ్వు వచ్చింది.

'అవేం పేర్లురా! శుభ్రంగా అసలు పేర్లెట్టి పిలవడం మానేసి... అయినా వాళ్ళెవరు!? ఏమిటి సంబంధం వాళ్ళకూ నీకూ?'

'సుబ్బరాజోరేయ్! చంద్రుడికీ వెన్నెలకీ ఏమిటి సంబంధం. విద్యార్థికీ సెప్టెంబరుకీ ఏమిటి చుట్టరికం, తెలుగు సినిమాకీ, కన్నీటికీ ఏమిటి రిలేషను–ఈ కథ రాసేవాడికీ – చదివే ఆయనకీ ఏమిటి చుట్టరికం... అద్గదీ... ఆకర్షణంటారే అదీ... అదే... అదే సుమా నిజం' అన్నాడు పురుషోత్తముడయిన పురుషోత్తం. వెధవ ఎండలో తిరిగొొచ్చేడేమో... ఎండదెబ్బ తినేసి వుంటాడు. అంచేతే తెలుగు సినిమా హీరోయిన్ తండ్రిలా అడ్డదిడ్డంగా వాగుతున్నాడు.

మళ్ళీ మొదలెట్టాడు. 'ఎండ అసలు పేరు శారద... మరి గొడుగు పేరు నాంచారమ్మగామోసు, నాకు సరిగా తెలీదనుకో, వాళ్ళ ఇల్లులు ఫలానీవీధిలో... చదూతున్నది బియస్సీనో, బియ్యేనో ఇక ఎండ ఫాదరుపేరు రిఫ్లెక్టరన్న... మాట, అంటే దర్పణంగామోసు తెలుగులో... మరో విషయం ఆయన ఏభై వేల వరకూ కట్నం ఇచ్చుకోగల్రని మా బీ.బి. చెప్పాడు... బీ.బి. అంటే బీటు బాబన్న మాట... సిసలయిన గర్భాచర్లే... తరువాత నాకెలాగు డబ్బులూగట్రా అవసరం గనుక నేనతన్ని పెళ్ళాడ్డానికి సరదా పడుతున్నాను'.

నాలుగు తన్నేసి, మేడమీంచి క్రిందికి తిరగేసి, లేక సుబ్బరంగా ఉతికేసి, టినోపాలూ, గంజీ పెట్టించి, వీరాసావి చేత ఇస్త్రీ కూడా చేయిందా మనుకున్నాను గాని వాడ్నాకంటే కొంచెం దళసరి, వెడల్పూ కూడా...

'ఒరే ఇల్లులు అనకూడదు ఇళ్ళు అనాలి... తరువాత నువ్వు బీటుబాబును కానీ, దర్పణం గార్ని కానీ పెళ్ళాడ్డం బావోదని నా అభిప్రాయం... కావాలంటే ఆయన కూతుర్ని పెళ్ళాడు బావుండొచ్చు...' అనేసి లేచి వెళ్ళిపోయాను.

మర్రెండ్రోజులు పోయాక, ఒకానొక సాయంత్రం మావాడు నా ఎదురుగా కూర్చుని వికృతంగా... పాడటం మొదలెట్టాడు.

"ఈ విజయనగరుకిక రాను
వైజాగేపోతాను... పోతాను
తొలిసారివలపులకన్నా
సుతిమెత్తనిదేదీ లేదనీ
మొన్నను నాకు తెలిసింది
ఒకమ్మడు నాకు తెలిపింది
ఈ వెధవనగరుకిక రాను
ఆవూరేపోతానూ... పోతాను..."

'నువ్వుగాని పాట మానకపోతే మొన్న నేన్చూసిన ఎన్టీ రామారావు సిన్మాలోని రెండు సీన్లు రూంలో నటిస్తానని' భయంకరమయిన భోగట్టా చెప్పి బెదిరించాను. దెబ్బతో ఝడుసుకుని బుద్ధిగా కూర్చున్నాడు. అంతలో, September రంత వేగంగా సుడిగాల్లా వచ్చాడొకబ్బాయి.

వచ్చినవాడు పురుషోత్తం ఫ్రెండు. ఈ పురుషోత్తం అనేవాడికి వున్న అనేకానేకమంది స్నేహితుల్లో ఈ అబ్బాయి మరీ హితుడు... అతనసలు పేరు నాలాగే చాలామందికి కూడా తెలియదు.

తన పేరు బీటుబాబని మాత్రం అతను బాహాటంగా పబ్లీకున మొగ్గేసి మరీ ఒప్పుకుంటాడు. బీటూబాబు, పురుషోత్తవూ చెవులూగట్రా కొరుకున్నారు. మావాడి మొహం క్రొత్త కాంగ్రెస్‌లా వెలిగింది.

'నిజంవేనా' అన్నాడు పురుషోత్తం.

'నిఝంవే' అన్నాడు బీ.బి.

'ఒట్టూ' అ.పు.

'ఒట్టూ... మా ప్రిన్సిపాల్తోడు' అ.పు. బీ.బి. దాంతో మా పురుషోత్తం బీ.బిని పొగిడి, రెండ్రూపాయలు అప్పూ, తన టెరిలిన్ చొక్కా ఎరువూ ఇచ్చి పంపేసి నన్నర్జంటుగా బయలు దేరమన్నాడు' ఎక్కడి కన్నాను.

'ఎండా, గొడుగూ క్రొత్త సిన్మాకెళ్తున్నాయట, మరందువలన...

లే; ఇదే ఖరారు. నగరు టెడారిలో వలపుల బిడారు

లే! ఇదేఛాన్సు, వచ్చి మనవాడిన్ఫర్మేషనిచ్చినాడు

లే జాగేల, పరాకేల, వెర్రివెధవాయ లేచి రమ్ము

లే నేడీ విజయనగరాన, బిరాన మనకై తేలింది వలపు విరాళి.

అని సో.సు.కి పేరడీ పాడి నన్ను ఈడ్చుకుంటూ థియేటరు దగ్గరికి తీసుకెళ్ళాడు.

రెండ్రోజులన్నా ముందు తెలియకుండా వాళ్ళు సినిమా కెళ్తున్నందుకూ, నగరంలో, ఇంకేం పన్లేని వెధవలందరూ ఈ సినిమాకే వచ్చినందుకూ, మహచెడ్డరద్దీగా వున్నందుకూ పురుషోత్తం చెడ్డ చీకాగ్గా వున్నాడు. కోపంగా వున్నందువల్లనేమో, విసురుగా వేగంగా నానా అవస్థపడి బాల్కనీ టిక్కెట్లు బ్లాకున కొనేసి థియేటర్లోకి తీసుకెళ్ళాడు.

బాల్కనీ అంతా వెతికినా 'వాళ్ళు' కనిపించలేదు. 'ఒరే శాస్త్రీ... ఎండలేదురా...' దిగులుగా, జలుబు చేసినట్లుగా వుంది వాడి కంఠం.

'పోనీ రాలేదేమో...'

'షటప్.. బీ.బి. జన్మలో అబద్ధమాడి వుండలేదు... మరంచేత... నువ్వు నోరుమూసుకుని ఇక్కడే అఘోరించు. నేనిలా క్రిందకి వెళ్ళి వస్తా!'

తలూపాను... పదినిముషాల్లో మనవాళ్ళు పంపిన రాకెట్‌లాగా టక్కన తిరిగొచ్చేసాడు.

'ఏమయింది?'

'రాజుకి జలుబు చేసింది... విక్సువేపొరబ్'

'షటప్పు...' షటప్పయాను...

'మరే, ఒరే! ఈవూరి కాలేజమ్మాయిలకి స్టేటస్, స్టైయిలూ, మెంటెన్ చైదం పాండ్సు పవుడరూ, ప్లాస్టిక్ చెప్పుల వరకే పరిమితం... మధ్య మనం సిగ్గుపడాలి...' మావాడి సహృదయతని వాళ్ళు అపార్థం చేసుకోకుందురు గాక!

'అసలేం జరిగింది?' అడిగాను.

'ఇంకేం జరగాలి... ఎండెళ్ళి క్రిందకి దాంకుంది... ఇక ఎదరంతా చీకటి, ఇక్కడంతా చలి సుబ్బరాజోయ్! ఎండ్రా... ఎండకావాలి... కాని ఇక్కడికది ఒచ్చే సదుపాయం లేదు... బాల్కనీ అంతా మబ్బుపట్టేసింది... కనుక...' నీళ్ళూ, గాలీ, సిగరెట్టు పొగాకలిపి నమిలాడు (శెభాష్) 'కనక' వీడి వాటంచూస్తే నాకు చెడ్డ అనుమానంగా వుంది.

'కనుక... మనమే క్రిందకెళ్దాం...' నాకేసి బితుకూ, బితుకూ చూసాడు. క్రొత్తగా Charge తీసుకున్న కుర్ర మాస్టారు జ్ఞాపకం వచ్చేరు. కాన్నాకు కోపం ఎక్కువగానే వుంది.

'షటప్! ముంగిలా మొహం నువ్వూను. ఆ అమ్మాయి ఎండయితే నువ్వు నీడ గోడ... నీడ... సిగ్గుండాలి... కనీసం రెండు లీటర్లన్నా ఎక్కడన్నా సంపాదించు నేనుమట్టుకూ క్రిందకి రాను...' అన్చెప్పి చెరిగేసేను.

బిక్క చచ్చిపోయి బ్రతిమాలేడు.

చంపుకు తిన్నంత ఒట్టన్నాడు, విజయనగరంలో అద్దె ఇంట్లోవుంటున్నంత, హోటల్లో కాఫీ త్రాగినంత మూడు గుర్రాల బీడీ కాల్చినంత ఒట్టన్నాడు, నేనొచ్చినందుకు పదీ, నా పరువు ఖరీదు రెండ్రూపాయలూ మొత్తం పద్నాలుగు రూపాయలూ ఇస్తానన్చెప్పి, ఆ మూడూ నా చేతిలో వుంచి, కావలిస్తే వాడి జేబులు నన్నే రెండ్రోజులు వాడుకోమని ఉదారంగా ఇచ్చాడు. చెప్పొద్దూ... వాడ్ని చూసి తెలుగు కథా రచయిత మీద,

పత్రికా సంపాదకుడికి వేసినంత జాలి కలిగింది. వాణ్ని ఉద్ధరించేద్దామని గట్టి ఆలోచన కలిగింది. కావలిస్తే వెంటనే వెళ్ళి ఆ అమ్మాయిని లాక్కొచ్చి, థియేటరుమీద, పైకప్పమీద కావలిస్తే మావాడి ప్రక్కన కూర్చో బెడదామన్నంత ఆవేశం కలిగినా వెంటనే హిందీ ఏజిటేషన్లా చల్లారి పోయిందది, 'పదపద వెళ్దాం'

'మరి పాసులమ్మేద్దామా?' మావాడీ మధ్య మరీ దిగజారి పోతున్నాడు.

'ఛ! ఛ! ముందు ఆ అమ్మాయి ఎక్కడుందో. నన్ను చూడ్నీ. ప్రక్కనగానీ, వెనుకను గానీ సీటు దొరికితే బాగు'

వాళ్ళిద్దరి వెనకా, ప్రక్కా అన్నీ Fillup అయిపోయాయి. వాళ్ళ వెనకాల ఓ అడ్డబాస మామ్మగారూ, ఆవిడ తాలూకా ముక్కుపొడుం తాతగారు వృద్ధ దేవతల్లాగా బహుసౌమ్యంగా అవుపించారు.

మావాడికో ప్లాను చెప్పి దూరంగా నిలుచున్నాను. ఆ ప్రకారం పురుషోత్తం మా ముక్కెరమామ్మగార్ని బయటికి పిలిచాడు.

'ఏం నాయినా! ఎవరు కావాలం'దావిడ!

'నమస్కారం! మామ్మగారూ... నా పేరు పురుషోత్తమండి... వీడు పేరు సుబ్రహ్మణ్యవని మా వాడే... మిమ్మల్చూసినందుకు మాకు చాలా ఆనందంగా వుందండి'

ఆవిడ తెల్లబోయింది.

'ఏవిటోనండి కలికాలం... మీరు కూర్చుందగ్గర నల్లులు ఎక్కువగా వుంటాయండి... మరే పాకిస్తాన్ విజయనగరం హౌ ప్రపంచం ధర్మరాజు తమ్ముడు భీవుడని మాంఛివస్తాదొకడు వుండేవాడండి వాడికీ (నాకేసి చూపించి) నాకు మంచి స్నేహం... అయినా ఈ మధ్య మంచి అప్పడాలు తిన్లేదండి. ఏవిటో వర్షాల్లేక పోతే ప్రేమలెలా పండుతాయండి' అంటూ అర్థం లేకుండా మాట్లాడాడు.

ముసిలావిడ పాపం 'ఆస్పిటలు నుంచే నేవిటి నాయినా!' అనడిగింది జాలిగా...

"అవునండి, మీ కాళ్ళు పట్టుకుందామని నాకు మా చెడ్డ సరదాగా వుందండి... కాని ఇక్కడందరూ చూస్తారని పట్టుకోవడం లేదు... ఆనిక మీ ఇంటి దగ్గర ప్రత్యేకంగా కాళ్ళ మీద పడతానండి'

'అలాగేలే నాయినా... నీ ఎడ్రసిస్తే, కాళ్లు పీకిన వెంటనే కబురంపుతాను అలాగే వొచ్చి నీ సరదా తీర్చుకుందూ గాని... ఏం? మరే బెంగెట్టుకోకు' అందావిడ దయగా...

'అలాగేనండి, భగవంతుడు కరుణామయుడు, ఈ మధ్యని బొగ్గులు మరీ ప్రియమయి పోయాయండి'

మావాడి ధోరణి నాకేం నచ్చలేదు... వాడిని ప్రక్కకిలాగేసి మామ్మగారితో 'వాడికి కొంచెం నట్లూజనీ, అంచేత బాల్కనీ టిక్కెట్టు తీసుకుని కూడా క్రింద తరగతిలో కూర్చుంటానికి సరదా పడుతున్నాడనీ – అందువలన, మీరు మీ సీట్లూ, పాసులూ మాకు దయచేయించి, మీరిద్దరూ దయచేసి బాల్కనీకెళ్ళి సుఖపడితే దేశం బాగుపడుతుందనీ చెప్పి ఆవిడ చేతిలో బలవంతంగా పాసులు పెట్టి మొహమాట పెట్టేను.

ఆవిడ తన తాలూకా ముక్కు పొడుం తాతగార్ని వెంటేసుకుని గుసుస్తూ తమపాసులూ సీట్లూ మాకిచ్చి బాల్కనీకేసి వెళ్ళిపోతూ... జాగ్రత్త నాయినా, అతన్ని జాగ్రత్తగా చూసి వెంటనే మళ్ళీ హాస్పిటల్లో చేర్పించేవరకూ నీకీ కష్టాలు తప్పవన్చెప్పి వెళ్ళిపోయింది.

లైట్లార్పేవరకూ ఆగి తరవాత చటుక్కున సీట్లో కూర్చుని నన్ను బలవంతంగా కూర్చోబెట్టాడు వాడు. తరువాత వోల్టేరనే ఆయన 'మంచి భావాలు గెడ్డాలవంటివి గనక, కొంచెం వయసు వచ్చేవరకూ రావని' అన్నాడనీ, కనుక, గెడ్డాలు మంచి భావాలు వంటివే గనక, ఎటొచ్చీ ఆడాళ్ళకవి వుండే అవకాశం లేదనీ, ఒకవేళ వున్నా, ఆడదాని గడ్డాల్లాగే అసందర్భంగా వుంటాయనీ గంభీరంగా చెప్పి, రెండోది తన స్వకపోల కల్పితమనీ, కావలిస్తే

ఎవరన్నా ఫ్రీగా వాడుకో వచ్చని కూడా చెప్పాడు. అలాంటివే కొన్ని కంఠతాపెట్టిన జోకులు అసందర్భంగానూ, సమయానుకూలంగానూ వేసి నన్ను రకరకాలుగా హింసించాడు.

నేనేదో సీను చాలా బావుందని మెచ్చుకుంటే అంత బావుంటే ఈలేసి, మొగ్గెయ్యమని విట్టు చెప్పి గలగలా నవ్వాడు.

ఇంటర్వెల్‌లో కాబోలు ఎండనబడే శారద వెనక్కి తిరిగిచూసి, గొడుగని పిలవబడే నాంచారమ్మతో ఏదో చెప్పి ఇద్దరూ కలసి జాయింటుగా డ్యూయట్ నవ్వు నవ్వారు.

పురుషోత్తం రెండు Kg. లు సంతోషించి నాకు కోకోకోలా ఇప్పించి వాడు సోడా త్రాగి రెట్టింపు ఉత్సాహంతో జోకుట మొదలిడెను. కాని ఎంచాతో పావుగంటయేసరికి సైలన్సయి ఆ తరువాత స్టాపయి, ఆ వెంటనే కీప్క్వయిట్ అయిపోయాడు.

అప్పుడు గొడుగనబడే గర్ల్ వెనక్కి తిరిగి చూసి, తన నేస్తురాలితో అంది కదా –

'కంఠతా పెట్టిన మట్టుకూ అయిపోయాయి ఇక మనం సుబ్బరంగా సినిమా చూడొచ్చేవ్ శారదా' అన్జెప్పి నవ్వింది.

దాంతో పురుషోత్తంగాడు వూండయి సరెండరయి ఇంటి కొచ్చేసిన్దాకా నోరెత్తలేదు.

మర్నాడుదయం నేను లేచి మొహం కడుక్కుని కాఫీ తాగేసి వచ్చినా వాడింకా లేవలేదు. వాడి గుండెలమీద బోర్లా పడున్న నోట్సు పుస్తకం తీసి చూసాను. కవిత్వం 'అబ్సేసి' ఈ వెధవకి లవ్లో పడేసరికి కవిత్వం కూడా వచ్చేసిన్దే అని రెండు గజాలు ఆశ్చర్యపడి తేరుకుని కోపం వచ్చి చించిపారేసాను. పురుషోత్తంగాణ్ని లేపి 'బుద్ధిలేదా భడవా'... అని తిట్టిపోసాను. వాడ్లేచాడు చింపేసిన కాగితాలు చూసాడు. నా తిట్లన్నీ విన్నాడు నేను చింపేసింది ఒట్టి కాగితమే అయితే పరవాలేక పోననీ, కాని నేను చింపేసింది ఒకానొక అందమయిన ఆడకూతురి యొక్క హృదయమనీ, తన హృదయానికేమీ భయంలేదనిన్నీ ఆ హృదయం ఆ అమ్మడు జాగ్రత్తగా దాస్తుందని తనకి భరోసా వుందనీ చెప్పి భోరున ఏడిచి వాడిగోళ్లు కొరికేస్కుని, తరువాత నా ఒక్కచేతి గోళ్ళు మాత్రమే కొరికేసి, ముక్కు చీదుకొని బాత్రూంలోకి వెళ్ళిపోయాడు.

మర్రెండ్రోజ్లు ఫలానీ వీధంట తెగ తిరిగి 'పదహారు వేలడుగుల పై చిలుకురా' అన్చెప్పి ఆ విధంగా ఆ రోడ్డు పొడవు కొల్చినందుకుగానూ తెగ సంతోషించి బస్టాపులో నుంచుని నే కాలుస్తున్న సిగరెట్ లాక్కుని కాల్చిపారేసి వెంటనే

'నీ కోసం నేనే వచ్చాను బస్టాపున దీపవైనాను' అంటూ అశ్రుకవిత్వం చెప్పి కళ్ళ నీళ్ళెట్టుకుని నాచొక్కాతో కళ్ళు తుడుచుకొని

'ఒరే ఒరేరే! ఇంత విశాలమయిన నా హృదయంలో ప్రతికార్నర్‌కీ, గదికీ కూడా ఎండ వెచ్చగా సోకుతోంది తెలుసా?' అని పబ్లీకున నాతో అన్నాడు.

ఈ విధంగా పురుషోత్తం అనేవాడు రెండు వేల అడుగుల పైచిలుకు లోతు ప్రేమలో పడిపోవడం నాకు గమ్మత్తనిపించి ఆ భోగట్టానే వాడితో ప్రైవేటుగా అన్నాను.

ఆ రోజు మళ్ళీ శనారం––

'రూమ్మేటూ! రూమ్మేటు... పారేస్కున్న నా హృదయం మళ్ళా ఫలానీఖాళేజీ రోడ్డు మీద దొరికింస్మీ' అన్చెప్పి ఆ హృదయం యొక్క పేరు సునీతనీ, 'చాలా బావుంటుంస్మీ' అని కూడా చెప్పి ఆవిణ్ని వర్ణించాడు.

మరో క్రొత్త కేసు కామోసు 'మరి ఎండ సంగతేమిటి'

వాడు నవ్వాడు.

అది ఖచ్చితంగా నా అజ్ఞానానికి జాలిపడుతో అయ్యుండొచ్చు.

'అదా... ఆవిడ ఎండయితే... ఈవిడ వెన్నెల్లే... అదీగాక... నాకు ఎండకంటే వెన్నెలే, ఎక్కువిష్టం, గమ్మత్తుగా లేదూ'... చురుగ్గా దాటీసేడు.

'ఏమిటీ ఈ ఘోరం...' అవటాని నిల్చోబెట్టి అడిగేసి కడిగేసాను.

అప్పుడు చెప్పాడు వాడు–బహుశా కృష్ణుడు భగవద్గీత బోధించేప్పుడు వాడ్లాగే ఫీలయి మొహం పెట్టుంటాడు. 'వాడి గుండెకు నాలుగర్లున్నాయ్ట. అందులో ఒక్కో అరా, ఒక్కో అందమయిన అమ్మడికి ఒక్కోవారానికి మాత్రం అద్దెకిస్తాట్ట. అంచేత ఈ వారం సునీద్దట....'

'మరైతే ఒచ్చే వారం ఎవర్రా' అనడిగాను తెగించి 'నువ్వు మాత్రం కాదులే' అన్నాడ్నవ్వూ.

కొంతమంది కుర్రాళ్ళు<br>
పుట్టుకతో వృద్ధులు<br>
పేర్లకీ పుకార్లకీ, ఫకీర్లకీ నిబద్ధులు<br>
వీళ్ళకి కళలన్నా, రసమన్నా చుక్కెదురు<br>
కాకుల్లా అరవడమొకటే వీళ్ళెరుగుదురు. –(శ్రీశ్రీ)

(శ్రీశ్రీకీ, సోసుకీ, ఆరుద్రకీ కృతజ్ఞతలు)

*విజయనగరం మహారాజా కళాశాల మ్యాగజైన్, సెంటినరీ సావనీర్, 9.11.1971*

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1433**

* * *

**Read other books by K. N. Y. Patanjali @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=K.N.Y.+Patanjali&id=29**